క్లుప్తంగా

ముమ్మరంగా ధాన్యం సేకరణ



విజయవాడరూరల్: విజయవాడరూరల్ మండలంలో ధాన్యం సేకరణ ముమ్మరంగా సాగుతోంది. మండలంలోని 17 రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం సివిల్ సప్లయిస్ శాఖ ద్వారా సేకరిస్తోంది. పైడూరుపాడు గ్రామ రైతులు గురువారం తమ ధాన్యాన్ని ఆర్బీకే ద్వారా విక్రయించి రైస్ మిల్లుకు పంపించారు. మండలంలో ఇప్పటి వరకు 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్‌బాబు తెలియజేశారు. మిచాంగ్ తుఫాన్ కారణంగా దాదాపు 3400 ఎకరాల్లో ధాన్యం దెబ్బతిందన్నారు. మండలంలో మొత్తం 32 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ఇంకా గ్రామాల నుంచి 13 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రావాల్సి ఉందని పేర్కొన్నారు. రైతులు ధాన్యం విక్రయించే విషయంలో ముందుగా ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని రంగనాథ్‌బాబు విజ్ఞప్తి చేశారు.

అంతర్గత నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



రామవరప్పాడు: విద్యార్థులు ఉన్నత విద్యతో పాటుగా అంతర్గత నైపుణ్యాలు పెంపొందించుకోవాలని నిడమానూరు వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ పరిమి వంశీ అన్నారు. నిడమానూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం దాతలు పరిమి వంశీ, సింధూర సహకారంతో చదువులో ప్రథమ శ్రేణిలో రాణించిన విద్యార్థులకు రూ. 30వేల నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ గ్రామ మాజీ సర్పంచ్ పరిమి రమేష్ పుట్టినరోజును పురస్కరించుకుని ప్రతీ సంవత్సరం డిసెంబర్‌లో ప్రతిభ గల విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో దాత పరిమి సింధు, ఎంపీటీసీ సభ్యుడు శేఖర్, పాఠశాల హెచ్‌ఎం రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏపీ చర్మకార సేవాసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా సురేష్‌బాబు



కంకిపాడు: ఏపీ చర్మకార సేవాసంఘం కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శిగా నెప్పల్లి గ్రామానికి చెందిన పోలిమెట్ల సురేష్‌బాబు నియమితులయ్యారు. ఈ మేరకు తాడేపల్లిలోని సంఘం కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు బుల్ల రాజారావు, లిడ్ క్యాప్ ఎండీ డి.శంకర్, జనరల్ మేనేజర్ ఎస్.అధికారి చేతులమీదుగా నియామకపత్రం ఇటీవల అందుకున్నట్లు సురేష్‌బాబు తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సంఘం బలోపేతానికి, వృత్తిదారుల సంక్షేమానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

జగనన్న లేఅవుట్ పరిశీలన



గన్నవరం రూరల్: మండలంలోని గొల్లనపల్లి జగనన్న లేఅవుట్‌ను తహసీల్దార్ సీహెచ్ నరసింహారావు గురువారం పరిశీలించారు. లేఅవుట్‌లో జరుగుతున్న పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో అర్హులైన వారందరికీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు అందజేసిందని చెప్పారు. లేఅవుట్‌ను అభివృద్ధి చేసి పేదలకు వెంటనే ఇవ్వాలని మండల సర్వేయర్ మాధవరావుకు సూచించారు. గ్రామ వైఎస్సార్ సీపీ కన్వీనర్ గణపవరపు వెంకయ్య, పార్టీ నాయకుడు పడమట సురేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కానూరులో కరోనా కలకలం

పెనమలూరు: కానూరులో కరోనా కలకలం రేగింది. శబరిమలకు వెళ్లి వచ్చిన వ్యక్తి వ్యాధి లక్షణాలతో హోం క్వారంటైన్‌లో ఉన్నారు. వివరాల్లోకి వెళ్తే.. కానూరు మహదేవపురం కాలనీ సమీపంలోని ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇటీవల కేరళ రాష్ట్రం శబరిమల వెళ్లి ఇంటికి చేరుకున్నాడు. తర్వాత అస్వస్థతకు గురయ్యాడు. తీవ్ర జ్వరం, తలనొప్పి లక్షణాలు కనిపించడంతో విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించగా, కరోనా వ్యాధిగా నిర్ధారణ అయింది. దీంతో వైద్యుల సూచనల మేరకు హోం క్వారంటైన్‌లో ఉన్నాడు. కాగా ఇదే ప్రాంతంలో ఉంటున్న గృహిణికి కూడా కరోనా సోకింది. ఇటీవల ఆమె ఇంటికి హైదరాబాద్ నుంచి బంధువులు వచ్చి వెళ్లారు. గత నాలుగు రోజులుగా అస్వస్థతకు గురై వైద్య పరీక్షలు చేయించుకోగా, కరోనాగా నిర్ధారణ అయింది. ఈమె కూడా ప్రస్తుతం హోం క్వారంటైన్‌లో ఉన్నారు. ఒక్కసారిగా ఇరువురికి కరోనా సోకడంతో గ్రామం ఉలిక్కిపడింది.





సామాజిక ప్రభంజనం

సామాజిక సాధికార బస్సు యాత్రలో సామాజిక చైతన్యం వెల్లివిరిసింది. జన ప్రభంజనం కంకిపాడులో కెరటంలా ఎగిసిపడింది. పెనమలూరు నియోజకవర్గంలోని గ్రామాలన్నీ కంకిపాడు బస్సు యాత్ర బహిరంగ సభా ప్రాంగణానికి తరలివెళ్లాయి. కానూరు 100 అడుగుల రోడ్డు నుంచి కంకిపాడు వరకూ సాగిన ర్యాలీకి అన్ని వర్గాలూ సామాజిక సాధికార చైతన్యవంతులై స్వచ్ఛందంగా సభకు తరలివచ్చారు. ప్రతిపక్షాల కుట్రలను భగ్నం చేస్తూ సామాజిక నినాదాలతో జననేతకు సంఘీభావం ప్రకటించారు. జననేతకు అండగా నిలుస్తామని ప్రజానీకం చేసిన జై జగన్ నినాదం కంకిపాడు పట్టణంలో ప్రతిధ్వనించింది. బస్సు యాత్ర విజయవంతానికి కృషి చేసిన ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి కృతజ్ఞతలు తెలిపారు. బస్సు యాత్ర బృందానికి వేదికపై గజమాలతో చేసిన సత్కారం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తొలుత మహానేత వైఎస్సార్ విగ్రహానికి ప్రజా ప్రతినిధులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు

–కంకిపాడు







అర్హులందరికీ సంక్షేమ పథకాలు



హనుమాన్‌జంక్షన్ రూరల్: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ చేరవేసే లక్ష్యంతోనే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పేరుతో గ్రామగ్రామాన ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు బీహార్ క్యాడర్ ఐఏఎస్ అధికారి, వికసిత్ భారత్ ప్రోగ్రాం స్పెషల్ ఆఫీసర్ ఎం.రామచంద్రుడు తెలిపారు. బాపులపాడు మండలం శేరినరసన్నపాలెంలో నిర్వహించిన వికసిత్ భారత్ కార్యక్రమానికి గురువారం ఆయన హాజరయ్యారు. తొలుత ఎంపీడీఓ కె.జోగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 రకాల సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం గ్రామంలో ఆయా పథకాల ద్వారా జరుగుతున్న కార్యక్రమాలు, లబ్ధిదారుల వివరాలను స్పెషల్ ఆఫీసర్ ఎం.రామచంద్రుడు సంబంధిత శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు, ఆయుష్మాన్ భారత్, పీఎం కిసాన్, పీఎం ఆవాస్‌యోజన, ప్రకృతి వ్యవసాయం, గ్రామీణ తపాల జీవిత బీమా పథకాలను వివరించేందుకు ఆయా శాఖల అధికారులు ప్రాంగణంలో ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. 2047 నాటికి భారత్ ప్రపంచంలోనే అగ్రగామి కావాలనే ఉద్దేశంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన సందేశాన్ని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఉజ్వల పథకం కింద లబ్దిదారులకు గ్యాస్ కనెక్షన్లు, ఆయుష్మాన్ భారత్ కార్డులు, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ కింద పోషక ఆహార పంపిణీ జరిగింది. వ్యవసాయంలో డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రదర్శన ఏర్పాటు చేశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాలతో కూడిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను స్పెషల్ ఆఫీసర్ ఎం.రామచంద్రుడు ఆవిష్కరించారు. సర్పంచ్ అడపా అంజిబాబు అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా పంచాయతీ అధికారి కె.నాగేశ్వరనాయక్, డీఎల్‌పీఓ పి.సంపత్‌కుమార్, డెప్యూటీ తహసీల్దార్ కె.వెంకటరమణ, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, వ్యవసాయాధికారి జొన్నలగడ్డ భవాని, పీహెచ్‌సీ వైద్యాధికారి ఎంజే మంజూష, హౌసింగ్ ఏఈ డి.చంద్రశేఖర్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ ఎస్.అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా ‘ఆడుదాం ఆంధ్రా’ పోటీలు



నున్న జిల్లాపరిషత్ హైస్కూల్‌లో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

పెనమలూరు: పెనమలూరు మండలం, తాడిగడప మున్సిపాలిటీల్లో ‘ఆడుదాం ఆంధ్రా’ ఆటల పోటీలు సందడిగా జరుగుతున్నాయి. పెనమలూరు మండలంలోని క్రీడాకారులకు వణుకూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో వాలీ బాల్ పోటీలను గురువారం నిర్వహించారు. ఈ పోటీల్లో 12 జట్లు పాల్గొనగా గ్రామ సర్పంచ్ చక్క విజయ ప్రారంభించారు. అలాగే వణుకూరు పాఠశాలలో శుక్రవారం నుంచి కబడ్డీ పోటీలు ఉంటాయని ఎంపీడీఓ సునీతాశర్మ తెలిపారు. కార్యక్రమంలో ఏఓ లోయ శివశంకర్‌రావు, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాడిగడప మున్సిపాలిటీలో..

తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో ఆడుదాం ఆంధ్రా పోటీలు కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో రెండవ రోజు గురువారం జరిగాయి. శుక్రవారం కూడా కాలేజీ గ్రౌండ్స్‌లో ఆటల పోటీలు నిర్వహిస్తారు.



వణుకూరులో వాలీబాల్ పోటీలు

నున్న జిల్లాపరిషత్ హైస్కూల్‌లో..

నున్న(విజయవాడరూరల్): నున్న జిల్లాపరిషత్ హైస్కూల్‌లో జరుగుతున్న క్రికెట్ పోటీల్లో నున్న, పాతపాడు, పి.నైనవరం, అంబాపురం గ్రామాల నుంచి మొత్తం 10 క్రికెట్ జట్లు పాల్గొన్నాయి. క్రికెట్ పోటీల్లో పాల్గొన్న జట్ల నుంచి మండల స్థాయికి ఒక జట్టును ఎంపిక చేయడం జరుగుతుందని పీఈటీ వర్మ తెలిపారు.

కొత్తూరు తాడేపల్లి గ్రామంలో జరుగుతున్న బ్యాడ్మింటన్ పోటీల్లో 12 బ్యాడ్మింటన్ జట్లకు గానూ 10 జట్లు పోటీల్లో పాల్గొన్నాయని పీఈటీ ఫణికుమార్ తెలియజేశారు.



గన్నవరంలో బ్యాడ్మింటన్‌లో విజేతలుగా నిలిచిన జట్టు

గన్నవరంలో..

గన్నవరం: ఆడుదాం ఆంధ్రా పోటీలు మండలంలోని గ్రామసచివాలయాల పరిధిలో ఉత్సాహంగా జరుగుతున్నాయి. కేసరపల్లిలో క్రికెట్ పోటీలను సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక గురువారం ప్రారంభించారు. ఈఓపీఆర్డీ పి.వెంకటేశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి మౌనిక, పలువురు సచివాలయ సిబ్బంది, పీఈటీలు పాల్గొన్నారు. స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో స్త్రీ, పురుషుల విభాగాల్లో బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన టీమ్‌లు మండల స్థాయి పోటీలకు అర్హత సాధించాయని క్రీడల సమన్వయకర్త ధనియాల నాగరాజు తెలిపారు.

6న రాష్ట్ర స్థాయి మెగా క్రికెట్ టోర్నీ

విజయవాడ స్పోర్ట్స్: ఫ్రెండ్స్ క్రికెట్ క్లబ్, సచిన్ స్పోర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో జనవరి ఆరు నుంచి 13వ తేదీ వరకు ఎన్టీఆర్ జిల్లాలో రాష్ట్ర స్థాయి మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆర్.సుధాకర్, వి.నాని వెల్లడించారు. ఇబ్రహీంపట్నం మండలం మూలపాడులోని అంతర్జాతీయ క్రికెట్ మైదానాల్లో జరిగే ఈ పోటీలకు 20 జట్లు ప్రాతినిధ్యం వహిస్తాయన్నారు. విన్నర్ జట్టుకు రూ. 5 లక్షలు, రన్నర్ జట్టుకు రూ. 3 లక్షలు నగదు బహుమతితో పాటు ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఈ పోటీల్లో పాల్గొనాలనే ఆసక్తి ఉన్న క్రీడాకారులు 7075266438, 8332983777ను సంప్రదించాలని కోరారు. ముందస్తుగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న జట్లకే పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు.

వరహాలశెట్టి సేవలు చిరస్మరణీయం



రాధికా.. ఆలకించు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాధవ్ కౌశిక్, శివారెడ్డి, శ్రీనివాసరావు తదితరులు



బుక్ స్టాల్స్‌ను తిలకిస్తున్న యువతీ, యువకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రముఖ ప్రచురణకర్త వరహాలశెట్టి సాహితీ లోకానికి అందించిన సేవలు చిరస్మరణీయమని ప్రముఖ రచయిత డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. 34వ విజయవాడ పుస్తక మహోత్సవంలో భాగంగా పుస్తక మహోత్సవ ప్రాంగణానికి నిర్వాహకులు వరహాలశెట్టి పేరు పెట్టారు. అలాగే ప్రతిభావేదికకు శ్రీరమణ, సాహిత్యవేదికకు రచయిత కేతు విశ్వనాథరెడ్డి పేర్లను నిర్వాహకులు ప్రకటించారు. వారి సంస్మరణ సభలను గురువారం రాత్రి ప్రధాన వేదికపై నిర్వహించారు. ఈ సభకు సాహితీవేత్త, నాయకులు ఓబులేసు అధ్యక్షత వహించారు. అనంతరం యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర మూడు జిల్లాలోనూ 50 ఏళ్లపాటు సాహితీప్రియుడు, పోషకుడుగా వరహాలశెట్టి తెలుగు సాహితీ లోకంలో చిరస్థానం పొందారన్నారు. మహాకవి శ్రీశ్రీ, చందు సుబ్బారావు లాంటి పలువురు కవులు, సాహితీమూర్తులు బుక్‌సెంటర్ కేంద్రంగా నిత్యం సాహితీ గోష్టులు నిర్వహించుకునేవారని గుర్తు చేశారు. వరహాలశెట్టి పేరు విజయవాడ పుస్తకమహోత్సవ ప్రాంగణానికి పెట్టడం ద్వారా ఉత్తరాంధ్ర సాహితీమూర్తులందరినీ గౌరవించినట్లయ్యిందన్నారు. శ్రీరమణ గురించి పన్నాల సుబ్రహ్మణ్యభట్టు వివరించారు. తెలుగు సాహిత్యంలో వ్యంగ్యాన్ని వ్యక్తీకరించిన రచయితల్లో పానుగంటి లక్ష్మీనరసింహారావు తర్వాత స్థానాన్ని శ్రీ రమణకు ఇవ్వవచ్చన్నారు. సుతిమెత్తగా హృదయాల్లోకి చొచ్చుకుపోయేలా మన చుట్టూ జరుగుతున్న ఘటనలపై మనకు స్పృహ కలిగించే శక్తి హాస్య రచయితలకే ఉందన్నారు. సాహిత్యంలో కేతు విశ్వనాథరెడ్డి సాహితీకృషి గురించి సాహితీవేత్త మందలపర్తి కిషోర్ వివరించారు. విజయవాడ నగరాన్ని పూర్తిగా తిరిగి సొంతం చేసుకున్న రచయితల్లో కేతు విశ్వనాథరెడ్డి ఒకరన్నారు. పాత్రికేయుడుగా, రచయితగా తెలుగుసాహిత్యంపై కేతువిశ్వనాథరెడ్డి తనదైన ముద్ర వేశారన్నారు. పల్లెల నుంచి పట్టణాలకు వలసవచ్చి తమ అస్తిత్వం కోసం ఆవేదన చెందుతున్న వ్యక్తుల మనోభావాలను తన కథల ద్వారా అద్భుతంగా వెల్లడించారన్నారు. ‘దాపుడుకోక’, ‘జప్తు’, ‘వానకురిసే’ తదితర కథలను ఆయన ఉదహరించారు. కేతు విశ్వనాథరెడ్డి రచనాశిల్పం సామాన్యులను, మేథావులను ఒకేరకంగా ఆకట్టుకుంటుదన్నారు. ప్రతిభావేదికపై జరిగిన మేజిక్ షో విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంది.



పుస్తకాలను పరిశీలిస్తున్న విద్యార్థులు



సీనియర్ జర్నలిస్ట్ కొండా రాజేశ్వరరావు కన్నుమూత



భవానీపురం(విజయవాడపశ్చిమ): సీనియర్ జర్నలిస్ట్ కొండా రాజేశ్వరరావు గురువారం మధ్యాహ్నం గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన గత కొంత కాలంగా గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నారు. వివిధ పత్రికల్లో జర్నలిస్ట్‌గా పని చేసిన ఆయన కొంత కాలం న్యాయవాది వృత్తిని చేపట్టారు. ఏపీయూజేడబ్ల్యూ విజయవాడ యూనిట్ కార్యదర్శిగా యూనియన్ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనేవారు. రచయితగా కొన్ని కవితలు రాసిన ఆయన హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థలో సేవలు అందించారు. కొండా రాజేశ్వరరావు ఆకస్మికంగా మరణించిన విషయం తెలుసుకున్న పలువురు జర్నలిస్టులు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. రాజేశ్వరరావు అకాల మృతిపట్ల వివిధ జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు తమ సంతాపాన్ని ప్రకటించారు.